క్లుప్తంగా

ఘనంగా బండిమాంబ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామపెద్దలు

సబ్బవరం: మండలంలోని పెదయాతపాలెం గ్రామంలో కొలువుదీరిన బండిమాంబ అమ్మవారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని గ్రామ పెద్దలు శరగడం రాము, బొడ్డేటి మహ లక్ష్మినాయుడు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


ఈస్టర్ సందేశాన్ని వివరిస్తున్న ఫాదర్లు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరంలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో ఫాదర్ కల్యాణ్ క్రీస్తు పునరుత్థానుడైన సందర్భాలు, సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఇక్కడి చర్చి ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ థామస్ పొలికల్ ఈస్టర్ సందేశం ఇచ్చారు. సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులతో అర్ధరాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించి చర్చల్లోకి ప్రవేశించారు. రావలమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చిలో పాస్టర్ పువ్వుల విజయకుమార్ ఆధ్వర్యంలో.. గొటివాడ ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ చంటి, సబ్బవరం సాయినగర్ చర్చిలో జీసస్ క్రైస్టు ప్రేయర్స్ చర్చిలో పాస్టర్ డేవిడ్ రాజ్ ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మేహాద్రిగెడ్డ కాలువలో యువకుడి మృతి

సింహాచలం: మేహాద్రిగెడ్డ కాలువలో ఈతకు దిగి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేకుంది. మారికవలస ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవరు ఎన్.నిఖిల్‌వంశీ(20) ఒక ఈవెంట్స్ కంపెనీలో కూడా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి మేహాద్రిగెడ్డకు వెళ్లాడు. అక్కడ కాలువలో ఈతకు దిగి మునిగిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు తిక్కవానిపాలెం తీరంలో ఉత్సాహంగా గడిపారు. ఇసుక తిన్నులపై సేద తీరుతూ అలలపై నుంచి వచ్చే పిల్ల గాలులను ఆస్వాదించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆట పాటలతో యువత సరదాగా గడిపారు. తీరంలో జలకాలాటలతో యువత కేరింతలు కొట్టారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ త్రినాథరావు

బీచ్ రోడ్డు: నగరంలోని రౌడీషీటర్లకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ త్రినాథరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి నడవడిక కలిగి తే రౌడీషీట్ క్లోజ్ చేసేందుకు పరిశీలిస్తామన్నా రు. కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి


చీమలాపల్లిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్

సింహాచలం: పెందుర్తి నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మూడో రోజు ఆదివారం కూడా ఉత్సాహంగా సాగింది. జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- 95వవార్డు 502 సచివాలయం పరిధిలోని శివగాయత్రీనగర్‌లో వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఇంటింటికీ వెళ్లి పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కెవీఆర్.లక్ష్మి, రొమాల నూకరాజు, దొడ్డి పద్మ, సదాశివుని రవితేజ, గృహ సారథులు భవాని, కృష్ణమూర్తి, చిన్నం నాయుడు, సత్యవతి, దుర్గాప్రసాద్, సంగమేశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

పరవాడ: పరవాడ సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పేదవాడి అవసరాలను గుర్తించి వాటిని నూటికి నూరుశాతం అమలు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలను నేరుగా కలిసి సంక్షేమ పథకాలను వివరించే గొప్ప కార్యక్రమం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమమన్నారు. సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు ప్రజలు ముందుకు రావాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, ఉప సర్పంచ్ బి.రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల హరీష్, పైడింనాయుడు, సురేష్ పాల్గొన్నారు.

- వెన్నలపాలెంలో సర్పంచ్ వెన్నల అప్పారావు ఆధ్వర్యంలో నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి.. జగనన్న ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపించుకొని మరిన్ని సంక్షేమ పథకాలను పొందడానికి ప్రజలు ముందుకు రావాలని సర్పంచ్ అప్పారావు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెన్నల అరుణకుమారి, మండల జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, నాయకులు వి.సింహాద్రి, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

- రావాడలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వైస్ఎంపీపీ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. అలాగే ఆదివారం రాత్రి వాడచీపురుపల్లి, బొద్దపువానిపాలెం, భర్నికం, నాయుడుపాలెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు వివరించారు.

బంగారమ్మపాలెంలో..

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు గృహ సారథులు, వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. చంద్రబాబు చేసిన మోసాలను, ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిబద్ధతతో అందించిన సంక్షేమ పాలనను వివరించి వారి సంతృప్తి స్థాయిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, సచివాలయ కన్వీనర్ కోరుబిల్లి నూకరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దొడ్డి వెంకట రమణ,పార్టీ నాయకులు ఎస్‌పీ రాజు, దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వెన్నలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు


రావాడలో సీఎం జగన్ చిత్రపటాన్ని ముద్దాడుతున్న వృద్ధురాలు


మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కొటాన రాము, తదితరులు


శివగాయత్రినగర్‌లో..


జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


దుర్గమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: మండలంలోని బలిజపాలెం గ్రామంలో కొలువైన శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయ ప్రథమ వారికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు అమ్మవారిని దర్శించుకున్నవారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మామిడి కొండాజీ,సేనాపతి దుర్గ అప్పారావు, గొర్లె నూకరాజు, తాసుబిల్లి కనకరాజు, గొర్లె శ్రీను,ఆకుల శివ తదితరులు ఉన్నారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

సోషల్ మీడియా కన్వీనర్లతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్


సోషల్ మీడియా కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కన్వీనర్లు ప్రధాన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి కొత్తగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లతో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియా కన్వీనర్లపై ఉందన్నారు. సోషల్ మీడియా కన్వీనర్లకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చందు యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ ఐడీ బాబు, ఉగ్గిన నాగార్జున, హేమంత్, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కులాలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి


సంఘీభావం ప్రకటిస్తున్న వీవర్స్ ఫెడరేషన్ నాయకులు

గాజువాక: రాష్ట్రంలో 18 శాతంగా ఉన్న చేనేత కులాలకు ప్రభుత్వాలు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ డిమాండ్ చేశారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన సమస్త చేనేతల ఉత్తరాంధ్ర సర్వసభ్య సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలున్నప్పటికీ ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా చేనేతలకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో చేనేతలను గుర్తించాలని, లేని పక్షంలో చూస్తూ ఊరుకోబోమన్నారు. వీవర్స్ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర నాయకుడు పప్పు రాజారావు, నాయకులు మహేష్ సమతం, తెల్లపు వెంకటేశ్వరరావు, గుంటుక చంద్రశేఖర్, పప్పు దుర్గ రమేష్, ఆకిన వసంతకుమార్, కొప్పల రామ్‌కుమార్, రాపర్తి సుబ్బారావు, వానపల్లి సత్య, కర్రా రవి పాల్గొన్నారు.

వంద యూనిట్ల రక్తం సేకరణ


రక్తదాతలకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: తమతోపాటు చదువుకొని, ఆడుతూ పాడుతూ తిరిగిన మిత్రుడు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో చలించిన మిత్ర బృందం రక్తదానం చేసి పది మంది ప్రాణదానానికి దోహదపడ్డారు. అగనంపూడికి చెందిన కొశిరెడ్డి గుణశేఖర్ ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గుణశేఖర్‌తో బాల్యం నుంచి చదువుకొని ప్రస్తుతం ఇంజినీరింగ్ చేస్తున్న విద్యార్థులు ఆదివారం అగనంపూడిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వంద యూనిట్ల రక్తదానం చేశారు. మిత్రునికి ఈ విధంగా నివాళులర్పించారు.

సెలవు దినంగా మే డే



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే డేను సెలవు దినంగా ప్రకటించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి కోరారు. అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్ల ధర్నాను ద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఆపాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళ మహిళా కార్మికులతో పనిచేయించే విధానం రద్దు చేయాలని కోరారు. మే 1 జరుగు 137వ మే డేను పోరాట దినంగా పాటించి, వాడవాడలా ఎర్రజెండా ఎగురేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేలం శివ, కె.సత్తిబాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరి దుర్మార్గం


ఉక్కు రిలే దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం చలించకపోవడం దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 787వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో ఇంటక్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శిబిరాన్ని ఉద్దేశించి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే దేశంలో ఏ సంస్థ మిగలదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే దేశం ఆర్థికంగా మరింత దిగజారిపోతుందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యా వికాసంపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న రమాప్రభ, విద్యార్థులు

కంచరపాలెం: వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ కమిటీ, బొట్టా నర్సింగరావు ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఊర్వశి జంక్షన్‌లోని బీఎస్ఆర్ భవనంలో విద్యా–వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విద్యావేత్త కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యార్థి దశలో అభివృద్ధి చెంది తే వికాసానికి మార్గాలు దొరుకుతాయన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విద్యా వికాసంపై పలువురు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్ర

కుటుంబ సభ్యుల చెంతకు ఉమేష్


మానసిక రోగి ఉమేష్‌ను అప్పగిస్తున్న మురళీ, పోలీసులు

ఎంవీపీ కాలనీ: మానసిక సమస్యల కారణంగా కుటుంబానికి దూరమైన కబ్బే ఉమేష్(20) అనే యువకుడిని రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళీ త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానసిక స్థితి బాగోకపోవడంతో బళ్లారి ప్రాంతానికి చెందిన ఉమేష్ ఇంట్లో నుంచి పారిపోయి కొన్ని రోజుల క్రితం విశాఖ చేరుకున్నాడు. ఆర్కే బీచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడి టూరిజం పోలీసు స్టేషన్ సిబ్బంది త్రీటౌన్‌కు సమాచారం అందించారు. అనంతరం అతన్ని అదుపులోకి తీసుకున్న త్రీటౌన్ పోలీసులు సీఐ రామారావు సూచన మేరకు పెదవాల్తేర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీకి తరలించారు. కొద్ది రోజులుగా ఉమేష్ అక్కడే ఆశ్రయం పొందుతున్నాడు. అయితే రెడ్ క్రాస్ ప్రతినిధులు అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. త్రీటౌన్ పోలీసుల సమక్షంలో ఉమేష్‌ను కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు అప్పగించారు.

బొగ్గు రవ్వలతో కళ్ల మంటలు

- లారీల్లో ఓవర్ లోడ్‌తో నేలపై పడుతున్న బొగ్గు
- వెనుక వచ్చే వాహన చోదకుల అవస్థలు


అగనంపూడి టోల్‌గేటు సమీపంలో రహదారిపై బొగ్గు నిల్వలు


లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీకి వెళ్లే వంతెనపై బొగ్గు రవ్వలు


అన్‌లోడింగ్ చేసి వస్తున్న లారీలు

అగనంపూడి: పరిమితికి మించిన లోడ్‌తో బొగ్గు రవాణా చేస్తుండడంతో ప్రయాణికుల కళ్లల్లో మంటలు రేగుతున్నాయి. గంగవరం పోర్టు నుంచి హిందూజా పవర్ ప్లాంట్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వందలాది లారీలతో నిత్యం బొగ్గు రవాణా చేస్తున్నారు. అయితే జాతీయ రహదారి మీదుగా వాహనాలు పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో రవాణా చేస్తుండడంతో మార్గం పొడవునా బొగ్గు జారిపడుతోంది. ఆ లారీలను అనుసరించి వెనుక వెళ్లే వాహనచోదకుల కళ్లల్లో పడడంతో కళ్ల మంటలు కలుగుతున్నాయి. శ్రీనగర్ వంతెన, కూర్మన్నపాలెం టోల్ గేటుకు రెండు వైపులా, ఆర్టీవో కార్యాలయం, అగనంపూడి వంతెనకు రెండు వైపులా, లంకెలపాలెం వద్ద రహదారికి ఎడమ వైపున రహదారి బొగ్గుతో నిండిపోయి నల్లగా మారిపోయింది. పెద్ద గాలి వీస్తే రహదారిపై చేరిన బొగ్గు రవ్వలు వాహనచోదకుల కళ్లల్లో పడుతున్నాయి. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి నుంచి లంకెలపాలెం వరకు రోడ్డంతా నల్లగా మారిపోయింది. రోడ్డుకు ఎడవ వైపున నల్లగా మారిపోయి చిన్నపాటి వర్షం కురిసినా రహదారి నల్లబారిపోయి మురుగునీటితో నిండిపోతుంది. జాతీయ రహదారిపై గోతులు ఉన్న చోట అధికంగా బొగ్గు నేలజారుతోంది. వంతెనలపై అయితే మరీ దారుణంగా నిల్వలు చేరిపోయాయి. ఓవర్ లోడ్‌తో రవాణా చేసే లారీలపై చర్యలు తీసుకోవడంతోపాటు వెంటనే దారిపొడవునా చేరిన బొగ్గును తొలగించే ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ సేవలు అమోఘం



మాట్లాడుతున్న మాజీ వీసీ సత్యనారాయణ

డాబాగార్డెన్స్: హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగే సమయంలో కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు చేసే పోరాటం మరువలేమన్నారు. కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమ వంతు కృషి చేస్తున్నామని, కౌన్సిల్ చేస్తున్న కృషికి తమ సహకారం ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ, బీఎస్ లత, మాధవి గణపతి, నిర్మల, డాక్టర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

యువత భవిత కోసం ఆలోచన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న క్షేత్రపాల్

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ నాయకుడు క్షేత్రపాల్ అన్నారు. ఆరిలోవ ప్రాంతం అల్లూరి సీతరామరాజు నగర్‌లో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో యువతకు జరుగుతున్న అన్యాయం, సమస్యలను వివరించారు. యువత భవిష్యత్తు గురించి ఆలోచించగలిగినప్పుడే దేశం మంచి మార్గంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఆరిలోవ శాఖ అధ్యక్షుడు అప్పలరాజు, చరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.